నరకప్రాయం..ఈ ప్రయాణం

- గతేడాది వరదలకు దెబ్బతిన్న లింగాల కాజ్‌వే బ్రిడ్జి
- ఆంధ్రా, తెలంగాణకు అనుసంధానంగా బ్రిడ్జి
- పట్టించుకోని పాలకులు
- అవస్థల్లో వాహనచోదకులు
- కలగానే హైలెవల్ బ్రిడ్జి
- హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని ప్రజల డిమాండ్


గతేడాది వరద తీవ్రతకు పూర్తిగా ధ్వంసమైన లింగాల కాజ్‌వే (ఫైల్)

వత్సవాయి : చిల్లకల్లు–వైరా రోడ్డులో లింగాల వద్ద మునేటిపై ఉన్న కాజ్‌వే బ్రిడ్జి ప్రమాదభరితంగా ఉండటంతో వాహనచోదకులు, ప్రజలు తీవ్రభయాందోళనలకు గురవుతున్నారు. ఆంధ్రా–తెలంగాణ ప్రాంతాలను కలిపే ప్రధాన రహదారిలోని ఈబ్రిడ్జి గతేడాది సెప్టెంబర్‌లో సంభవించిన వరదలకు పూర్తిగా దెబ్బతింది. దీంతో పది రోజులకుపైగా రాకపోకలు నిలిచిపోయాయి. పాలకులు, ఆర్‌అండ్‌బీ అధికారులు తూతూమంత్రంగా మట్టిని పోసి మమ అనిపించారు మినహా..దెబ్బతిన్న బ్రిడ్జి పునర్నిర్మాణం అంశాన్ని ఏడునెలలుగా పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో ఈ బ్రిడ్జిపై ప్రయాణం చేయాలంటే వాహనచోదకులు, ప్రయాణికులు హడలిపోతున్నారు.

నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు...

జగ్గయ్యపేట, చిల్లకల్లు సమీపంలో సిమెంట్ కర్మాగారాలు ఎక్కువశాతం ఉండటంతో జాతీయ రహదారి తరువాత ఈమార్గం గుండానే ఎక్కువ రాకపోకలు సాగుతుంటాయి. లారీలు తెలంగాణ నుంచి బొగ్గు, బూడిదను తీసుకువచ్చి ఇక్కడ సిమెంట్ ప్యాక్టరీల్లో అన్‌లోడింగ్ చేసి తరువాత సిమెంట్ బస్తాలతో తెలంగాణలోని పలు ప్రాంతాలకు తిరిగి వెళ్తుంటాయి.

వరదొస్తే ప్రయాణం బంద్..

మునేటికి వరదలు పెద్ద ఎత్తున వచ్చిన సందర్భంలో కాజ్‌వేపై వరదనీరు పారుతుండటంతో రాకపోకలు నిలిచిపోతుంటాయి. సుమారు నాలుగైదు రోజులపాటు రాకపోకలు నిలిచిపోతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. వరదలు తగ్గిన తరువాత కాజ్‌వేపై చెత్తాచెదారాన్ని తొలగించి మరలా రాకపోకల పునరుద్ధరిస్తుండటం పరిపాటిగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యంతం కాజ్‌వే గుండా ప్రయాణాలు సాగిస్తున్నప్పటికీ శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచన చేయకపోవడం గమనార్హం.

గతేడాది కొట్టుకుపోయిన రహదారి..

గత సెప్టెంబర్ నెలలో మునేటికి గతంలో ఎన్నడూ లేనంతస్థాయిలో వరదనీరు పోటెత్తండంతో కాజ్‌వే పూర్తిగా దెబ్బతింది. రెండు చోట్ల రహదారి మొత్తం కొట్టుకుపోయింది. అంతేకాకుండా కాజ్‌వే పక్కన ఉన్న రక్షిత మంచినీటి పథకం పైపులైన్ కూడా కొట్టుకుపోయింది. దెబ్బతిన్న కాజ్‌వేకు తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. మట్టి, రాళ్లను వేసి రహదారి గండ్లను పూర్తి రాకపోకలు సాగిస్తున్నారు. మట్టి పోసిన చోట వర్షం పడితే చిత్తడిగా మారి లారీలు ఇరుక్కుపోతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాజ్‌వేకు ఇరువైపులా రక్షణగా నిలిచే దిమ్మెలు కూడా పగిలిపోవడంతో పరిస్థితి ప్రమాద భరితంగా మారింది. ప్రస్తుతం కాజ్‌వేపై పడిన గుంతల కారణంగా వాహనచోదకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఎదురుగా వచ్చే వాహనాల వెలుగుల్లో సక్రమంగా దారి తెలియడంలేదు. ఇటీవల ఖమ్మంకు చెందిన ఓ కారు అదుపుతప్పి మునేరులో పడింది. అదృష్ట వశాత్తూ ప్రాణాపాయం తప్పడంతో వాహనంలోని వ్యక్తులు, వారి బంధువులు ఊపిరిపీల్చుకున్నారు.

కలగానే హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం...

చిల్లకల్లు నుంచి తెలంగాణలోని వైరా వరకు జాతీయ రహదారిగా విస్తరించి మునేటిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ. క మునేటిపై నూతన బ్రిడ్జి నిర్మాణం అంశాన్ని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఆప్రభుత్వం ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించింది. ఈక్రమంలో వెంటనే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఆ ప్రతిపాదనలు రూపం దాల్చలేదు.


మరమ్మత్తులకు నోచుకోని లింగాల కాజ్‌వే

వరదొస్తే తీవ్ర అవస్థలు..



వరదల సమయంలో 15గ్రామాల ప్రజలు అవస్థలుపడుతున్నారు. మునేరుపై కాజ్‌వే దెబ్బతినడంతో తెలంగాణలోని ఖమ్మం, వైరా, తల్లాడ, సత్తుపల్లి, భద్రాచలం పలు ప్రాంతాలకు వెళ్లేవారు ఇబ్బందిపడుతున్నారు. ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి నూతన బ్రిడ్జి నిర్మాణం చేయాలి.

– కనగాల రమేష్, మాజీ సొసైటీ అధ్యక్షులు, మక్కపేట

హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి..



మునేటిపై కాజ్‌వే స్థానంలో హైలెవల్ బ్రిడ్జిని నిర్మాణం చేయాలి. వరదల కారణంగా కాజ్‌వే పూర్తిగా దెబ్బతిని ప్రమాదపుటంచున ఉంది. తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెట్టారు. ఇకనైనా రాష్ట్రప్రభుత్వం స్పందించి హైలెవల్ బ్రిడ్జిని నిర్మించాలి.

– తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, జగ్గయ్యపేట

సీఎం చెంతనే ఉంటూ కూడా..

ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలతోపాటు ఛత్తీస్‌గడ్ రాష్ట్రాలను కలిపే ఈ రహదారిపై ఉన్న కాజ్‌వేను ఆర్‌అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు నిరక్ష్యం చేస్తున్నారు. సుమారు 65ఏళ్ల కిందట నిర్మించిన కాజ్‌వేపైనే ఇప్పటివరకు రాకపోకలు సాగుతున్నాయి.కాజ్‌వే తక్కువ ఎత్తులో ఉండటంతో మునేటికి వరదలు వచ్చినప్పుడు రహదారిపై నీరు పారుతూ రాకపోకలు నిలిచిపోతున్నాయి. కాజ్‌వేకు వరదలు వచ్చిన సమయంలో నాలుగైదు రోజులపాటు మండలంలోని 15గ్రామాల ప్రజలకు జగ్గయ్యపేటతో పూర్తిగా సంబంధాలు నిలిచిపోతున్నాయి. కాజ్‌వే విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక మాజీ ఎమ్మెల్సీ, సీఎంకు అత్యంత సన్నిహితుడిగా పేరుగాంచిన లింగాల గ్రామానికే చెందిన టీడీ జనార్దన్ సైతం ఈ కాజ్‌వే వ్యవహారాన్ని ఏమాత్రం పట్టించుకోకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. నిత్యం సీఎం చంద్రబాబు పక్కనే ఉంటూ కూడా స్వగ్రామం లింగాల వద్ద దెబ్బతిన్న కాజ్‌వే అభివృద్ధికి జనార్దన్ ఏమాత్రం శ్రద్ధ చూపకపోవడం శోచనీయమనే విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఇకనైనా కూటమి పాలకులు స్పందించి మునేరుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. ఈవిషయంపై జగ్గయ్యపేట ఆర్‌అండ్‌బీ డీఈ పరుశురామ్‌ను వివరణ కోరగా వరదల కారణంగా దెబ్బతిన్న కాజ్‌వేకు రెండుమూడురోజుల్లో మరమ్మతులు చేపడతామని వివరించారు.

క్లుప్తంగా

సర్పంచ్‌కు మాజీఎమ్మెల్యే పరామర్శ



చందర్లపాడు(నందిగామటౌన్): అనారోగ్యంతో బాధపడుతున్న చందర్లపాడు మండలం తుర్లపాడు గ్రామ సర్పంచ్ వేల్పుల జయమ్మను మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు శనివారం పరామర్శించారు. జయమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న జగన్‌మోహనరావు ఆమె ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆమె మెడికల్ రిపోర్టులను పరిశీలించి ఆమెకు ధైర్యం చెప్పారు. ఆరోగ్యం కుదుటపడి పార్టీ కార్యక్రమాలు, గ్రామ పంచాయతీ కార్యకలాపాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, పెరమసాని నరసింహారావు, వేల్పుల వెంకటేశ్వరరావు, నెలకుదిటి శివనాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం

నందిగామటౌన్: ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను ఆమె కార్యాలయంలో కలిసి ఘనంగా సత్కరించారు. ఎస్సీ వర్గీకరణకు కూటమి ప్రభుత్వం అనుకూలంగా నిర్ణయం తీసుకోవడంపై నాయకులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్గీకరణ ఉద్యమానికి మందా కృష్ణమాదిగ ఆజ్యం పోస్తే, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ కలను సాకారం చేశారన్నారు. మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాటానికి దక్కిన ఫలమని పేర్కొన్నారు.

మెడికల్ షాపుల్లో తనిఖీలు

నందిగామటౌన్: కాలం తీరిన మందులు విక్రయించినా, నిబంధనలు పాటించకున్నా చర్యలు తప్పవని విజయవాడ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ హెచ్చరించారు. పట్టణంలోని పలు మందుల దుకాణాలను ఈగల్ టీమ్ సభ్యులు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత మందులు విక్రయించినా నిబంధనలు అతిక్రమించినా చర్యలు తప్పవని దుకాణదారులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఈగల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నందిగామరూరల్: ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్) పేదవర్గాల పాలిట వరమని ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ నుంచి 108 మందికి మంజూరైన రూ.62.65 లక్షల చెక్కులను శనివారం రాత్రి ఆమె పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులందరికీ సీఎంఆర్‌ఎఫ్ అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు టేబుల్ బహూకరణ



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని గెంటేల వెంకట జోగయ్య(జీవీజే) జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌కు 1974–75 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు శనివారం రూ.18వేలు విలువగల టేబుల్‌ను బహూకరించారు. టేబుల్‌ను పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం హనుమంతరావుకు అప్పగించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వీరవల్లి శ్రీనివాసరావు, మొరిశెట్టి రంగారావు, మేకా శ్రీనివాసరావు, నాగళ్ల వెంకట రాజారావు తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో రక్షణ : మండవ

నందిగామటౌన్: శక్తి యాప్‌తో మహిళలు, చిన్నారులకు పూర్తి రక్షణ ఉంటుందని నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి పేర్కొన్నారు. పట్టణంలోని చైతన్య కళాశాల విద్యార్థులకు శనివారం శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు శక్తి యాప్‌ను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అమరనేని రమేష్, విద్యార్థులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

జగ్గయ్యపేటఅర్బన్: పేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శనివారం తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి కౌన్సిలర్లంతా హాజరుకావాలని ఆయన కోరారు.

30నుంచి లక్ష్మీ నరసింహుని మాలధారణ

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీనరసింహస్వామి దీక్ష మాలధారణ ఈనెల 30 నుంచి ప్రారంభమవుతుందని ఆలయ ఈఓ సురేష్‌బాబు శనివారం తెలిపారు. 30న ప్రారంభమై ఏప్రిల్ 12తో ఇరుముడి సమర్పణతో మాలధారణ ముగుస్తుందని వివరించారు. ఈవిషయాన్ని భక్తులంతా గమనించాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సీపీలో అందరికీ అవకాశాలు


ఎంపీటీసీలు, ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్

ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్

నందిగామరూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రతి ఒక్కరికి అవకాశాలు వస్తాయని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నందిగామ ఎంపీపీ ఎన్నికకు సంబంధించి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ముఖ్య నాయకులతో శనివారం రాత్రి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ మాట్లాడుతూ ఎంపీపీ పదవి దక్కించుకునేందుకు అధికార పార్టీ ప్రలోభాలకు దిగుతోందన్నారు. మండల పరిషత్ అధ్యక్ష పదవిని ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కట్టబెట్టారని, ప్రజలు అందించిన అవకాశాన్ని ఐదేళ్లు కొనసాగించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. అధికార పార్టీ ప్రలోభాలకు లొంగి రాజకీయ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎంపీటీసీ సభ్యులకు సూచించారు.

ఎంపీపీ అభ్యర్థిగా రమాదేవి...


మండల పరిషత్ అధ్యక్షురాలిగా ఆపార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల ఏకాభిప్రాయంతో రాఘవాపురం ఎంపీటీసీ సభ్యురాలు పెసరమల్లి రమాదేవిని ప్రకటిస్తున్నట్లు అరుణకుమార్ వెల్లడించారు. అనారోగ్య కారణాల రీత్యా ఎంపీపీ అరిగెల సుందరమ్మ తనపదవికి రాజీనామా చేయడంతో ఇప్పటివరకు ఇన్‌చార్జ్ ఎంపీపీగా అకుల హనుమంతరావు బాధ్యతలు నిర్వర్తించారని వివరించారు. మండలంలో 14ఎంపీటీసీ స్థానాలకుగాను వైఎస్సార్‌సీపీ 13స్థానాలను కైవసం చేసుకోగా, టీడీపీ ఒక్క స్థానాన్ని మాత్రమే గెలుచుకుందని గుర్తుచేశారు. ఎంపీపీ పదవి కోసం అధికార కూటమి ప్రభుత్వం అన్నిరకాల మాయోపాయాలు వేస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలంతా అప్రమత్తంగా ఉండి ఈనెల 27వతేదీన జరుగనున్న ఎంపీపీ ఎన్నికలో పార్టీ సూచించిన అభ్యర్థి రమాదేవిని గెలిపించాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ గాదెల వెంకటేశ్వరరావు, నాయకులు మంగునూరు కొండారెడ్డి, గరికపాటి భాస్కరం, నెలకుదిటి శివనాగేశ్వరరావు, మంచాల చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీపీ మార్కపూడి గాంధీ, పక్కన జెడ్పీటీసీ నాగమణి, ఎంపీడీఓ శ్రీను, ఏఓ

పెనుగంచిప్రోలు: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పెనుగంచిప్రోలు ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాంధీ అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోని తాగునీటి ఇక్కట్లను అధికారులు ముందస్తుగా గుర్తించి సమస్య పరిష్కారానికి ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామాల్లో దోమల నివారణకు ఎబేట్ మందులు పిచికారీ చేయించాలన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20వేలు పంట పెట్టుబడి ఎప్పుడు ఇస్తారని వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసుతోపాటు పలువురు ఎంపీటీసీ సభ్యులు ప్రశ్నించారు. దీనిపై ఏఓ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి పథకం అమలుపై విధివిధానాలు రావాల్సి ఉందన్నారు. రైతులకు తైవాన్ స్ప్రేయర్లు, పీవీసీ పైపులు సబ్సిడీపై అందిస్తున్నట్లు వివరించారు. అలాగే ప్రభుత్వం ప్రకటించిన సూపర్‌సిక్స్ హామీలు అమలుకావడం లేదని ఎంపీపీతో పాటు పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు అధికారులను ప్రశ్నించారు. పింఛన్ తీసుకునే వృద్ధుడు చనిపోతే మరుసటి నెలలోనే అతని భార్యకు పింఛన్ మంజూరు చేసే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ విషయంపై అధికారుల నుంచి స్పష్టత రాకపోవడంతో అసంతృప్తి వ్యక్తంచేశారు. ఎంపీడీఓ జి శ్రీను మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. అన్నిశాఖలపై సమీక్ష నిర్వహించారు. సందర్భంగా గ్రామాల్లో కుక్కలు, కోతుల స్వైరవిహారాన్ని అడ్డుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై తీర్మానం చేశారు. గౌరవరం గ్రామ రైతులు ఇచ్చిన వినతిపై ఎంపీపీ గాంధీ స్పందిస్తూ ముండ్లపాడు నుంచి గౌరవరం గ్రామం వెళ్లే వాగుపై కల్వర్టు నిర్మాణానికి మండల పరిషత్ నుంచి రూ.2లక్షలు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కనగాల శ్రీనివాసరావు, వైద్యాధికారి సుజన, పీఆర్, హౌసింగ్, ఎస్ఎస్‌పీ ఏఈలు సుందరరామయ్య, సతీష్, గోపి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ జాన్‌మియా, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. ఒంగోలుకు చెందిన గాయనీ గాయకులు తాళ్ళూరి శ్రీదేవి, అంజిబాబు, అంజుస్వామి, తాళ్ళూరి రవి,, గోవిందరవి, రాజు, స్వామి, చరణ్ రాజ్ తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు గోళ్ళ నారాయణరావు, చింతకాయల చిట్టిబాబు, బోడి ఆంజనేయరాజు, కె.డేవిడ్‌రాజు, శింగంశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

భూగర్భ జలాలు పెరిగితేనే సమస్యకు పరిష్కారం


మునగచర్లలో నీటికుంటల తవ్వకం పనులను ప్రారంభిస్తున్న నందిగామ ఎమ్మెల్యే సౌమ్య


నీటికుంట పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)


అడవిరావులపాడులో పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ ఆకుల హనుమంతరావు(రంగా)

నందిగామ రూరల్:భూగర్భజలాలు పెరిగితేనే తాగు, వాడుక నీటి సమస్య పరిష్కారమవుతుందని ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మునగచర్ల వ్యవసాయపొలాల్లో చేపట్టిన నీటికుంటల తవ్వకం పనులను కూటమి నేతలతో కలిసి శనివారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నీటి కుంటల తవ్వకాల వల్ల భూగర్భజలాలు పెరగడంతోపాటు భూమిలో తేమశాతం పెరుగుతుందన్నారు. భూగర్భజలాలను పెంచుకుంటనే నీటి సమస్య తీరుతుందని చెప్పారు. నీటి కుంటల తవ్వకునేలా ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోందని వివరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

అడవిరావులపాడులో..

రైతులు వ్యవసాయ భూముల్లో నీటి కుంటలు తవ్వుకోవాలని ఎంపీపీ ఆకుల హనుమంతరావు సూచించారు. మండలంలోని అడవిరావులపాడు గ్రామంలో చేపడుతున్న నీటి కుంటల తవ్వకం పనులను శనివారం ఆయన ప్రారంభించారు. అదే విధంగా మాగల్లు గ్రామంలో గ్రామ నాయకులు నీటి కుంటల తవ్వకం పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సూరా వెంకట నర్సమ్మ, పంగలూరి నరసింహయ్య, ఆయాగ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

బండిపాలెం(జగ్గయ్యపేట): భూగర్భ జలాల పెంపుదలకు అందరూ కృషిచేయాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ కోరారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఉపాధి హామీ పథకం కింద బండిపాలెంలో చేపట్టిన పంట కుంటల తవ్వకం పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో భూగర్భజలాలు అంతరించిపోకుండా ప్రతి ఒక్కరు నీటికుంటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకంలో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నితిన్, ఏపీవో రామకృష్ణ, సర్పంచ్ ఎలిశమ్మ, నాయకులు పాల్గొన్నారు.

వీరులపాడులో..

వీరులపాడు: భూగర్భజలాలు పెంపొందించేందుకు ప్రతిఒక్కరు నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవాలని ఏపీవో జనార్దన్ సూచించారు. మండలంలోని నందలూరు గ్రామంలో చేపడుతున్న నీటికుంటల తవ్వకం పనులను గ్రామ నాయకులు, రైతులతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నరసింహారావు, వేణుగోపాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తనిఖీ


గోళ్లమూడి పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్డీవో బాలకృష్ణ

నందిగామరూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని ఆర్డీవో బాలకృష్ణ ఆదేశించారు. మండలంలోని గోళ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని సౌకర్యాలు, రోగులకు అందిస్తున్న వైద్యసేవలను అడిగితెలుసుకున్నారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా నడుచుకోవడంతోపాటు సమయపాలన పాటించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ సురేష్‌బాబు, సిబ్బంది ఉన్నారు

ఘనంగా ఫేర్‌వెల్ వేడుకలు


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్ తదితరులు

జగ్గయ్యపేటఅర్బన్: విద్యార్థులు లక్ష్యాలు ఏర్పరచుకుని వాటి సాధనకు కృషిచేయాలని, తద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సూచించారు. స్థానిక కొత్త వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో శనివారం పట్టణంలోని జీఆర్‌సీ విద్యా సంస్థలు, విశ్వభారతి డిగ్రీ కళాశాల ఫేర్‌వెల్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ విద్యతోపాటు క్రమశిక్షణను అలవరచుకోవాలని సూచించారు. మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో విద్యార్థులు చెడుఅలవాట్లకు ఆకర్షితులు కాకుండా విద్యపై దృష్టి సారించి తాము అనుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, జీఆర్‌సీ విద్యా సంస్థలు, విశ్వభారతి డిగ్రీ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపాల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

భూసేకరణ అభ్యంతరాలపై అధికారులతో సమీక్ష

నందిగామటౌన్: కొత్త రైల్వేలైన్‌కు సంబంధించిన భూసేకరణలో వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరిస్తామని ఆర్డీవో కె.బాలకృష్ణ తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శనివారం ఆయన ఎర్రుపాలెం–నంబూరు రైల్వే లైన్ భూసేకరణ అభ్యంతరాలపై రైల్వే అధికారులతో చర్చించారు. ఆర్డీఓ మాట్లాడుతూ రైల్వేలైన్ పనులకు సంబంధించిన కంచికచర్ల, వీరులపాడు మండలాల నుంచి వచ్చిన అభ్యంతరాలపై విచారణ చేపట్టి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు జాహ్నవి, హుస్సేన్ పాల్గొన్నారు.